క్లుప్తంగా

నేడు అనంతరాజుపేటలో గడప గడపకు కార్యక్రమం

రైల్వేకోడూరు : మండలంలోని అనంతరాజుపేట – 2 గ్రామ సచివాలయ పరిధిలో సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు జరిగే గడప గడపకు మన ప్రభుత్వంలో ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పాల్గొంటారని ఆదివారం వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు, మండల స్థాయి అధికారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కారు, బైక్ ఢీ : ఇద్దరికి గాయాలు

రైల్వేకోడూరు : మండలంలోని శెట్టిగుంట పంచాయతీ లక్ష్మిగారిపల్లె సమీపంలో ఆదివారం కారు, బైక్ ఢీ కొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్టు స్థానికులు తెలిపారు. వివరాల్లోకి వెళితే రైల్వేకోడూరు నుంచి తిరుపతి వైపు వెళ్తున్న కారు లక్ష్మిగారిపల్లె వద్దకు రాగానే ఎదురుగా అతివేగంగా వస్తున్న బైక్ ఢీ కొనడంతో ప్రమాదం జరిగిందన్నారు. ఈ సంఘటనలో బైక్‌పై వెళ్తున్న సురేష్, కిరణ్ అనే వ్యక్తులకు గాయాలైనట్టు వారు చెప్పారు. చికిత్స నిమిత్తం గాయపడిన వారిని తిరుపతి ఆసుపత్రికి తరలించినట్టు పేర్కొన్నారు.

తైక్వాండో ఆత్మరక్షణకు దోహదం



సర్టిఫికెట్ అందజేస్తున్న వైద్యులు శ్రీకృష్ణ, వినయ

రాజంపేట టౌన్ : శారీరక దృఢత్వానికి, మానసికోల్లాసానికే కాక ఆత్మరక్షణకు తైక్వాండో ఎంతగానో దోహదపడగలదని ప్రముఖ వైద్యులు శ్రీకృష్ణ, వినయ తెలిపారు. అన్నమయ్య తైక్వాండో అకాడమీ సీనియర్ మాస్టర్ సగినాల పెద్ద పిచ్చయ్య ఆధ్వర్యంలో వేసవి సెలవులను పురస్కరించుకొని నిర్వహించిన తైక్వాండో శిక్షణా శిబిరం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా క్రీడాకారులకు డాక్టర్ శ్రీకృష్ణ, వినయలు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సమ్మర్ సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ చినబాబు, తైక్వాండో ఇన్‌స్ట్రక్టర్ జాహిద్, అథ్లెటిక్ కోచ్ హరికృష్ణమరాజు తదితరులు పాల్గొన్నారు.

చర్చికి మైక్ సెట్ వితరణ



మైక్‌సెట్‌ను అందజేస్తున్న ఏకుల రాజేశ్వరిరెడ్డి

సిద్దవటం : మండలంలోని చాముండేశ్వరిపేట గ్రామ సమీపంలో ఉన్న సెయింట్ ఆంటోని చర్చికి ఆదివారం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏకుల రాజేశ్వరిరెడ్డి రూ.25 వేలు విలువ చేసే మైక్ సెట్‌ను చర్చి ఫాదర్ లారెన్స్, సిస్టర్ డెస్సికి అందజేశారు. ఈ సందర్భంగా ఫాదరన్ లారెన్స్ మాట్లాడుతూ ఏకుల రాజేశ్వరిరెడ్డిని చర్చికి మైక్‌సెట్ కావాలని అడగగానే ఆమె స్పందించి మైక్ సెట్‌ను చర్చికి అందించినందుకు ఆమెకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో రైతు కన్వీనర్ రామచంద్రారెడ్డి, పాఠశాల కన్వీనర్ జగదీష్, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంటు నాగిపోగు పుల్లయ్య, వెంకట్రామిరెడ్డి, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తిని ప్రతి ఒక్కరూ పాటించాలి



బహుమతులు అందజేస్తున్న జగన్‌మోహన్‌రాజు

వీరబల్లి (రాయచోటి టౌన్) : క్రీడలలో గెలుపోటములు సర్వసాధారణమని ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని పాటించాలని రాజు విద్యాసంస్థల అధినేత జగన్‌మోహన్ రాజు అన్నారు. ఆదివారం వీరబల్లె మండలం ఓదివీడు గ్రామం కావలిపల్లె సమీపాన క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌కు ఆయన హాజరయ్యాడు. అనంతరం గెలుపొందిన వారికి రూ.15,000లు రన్నరప్‌గా నిలిచిన వారికి రూ.10,000లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ క్రీడలలో గెలుపోటములు సర్వసాధారణమని అన్నింటిని స్ఫూర్తిగా తీసుకొని అన్ని రంగాల్లోనూ గెలుపోటములను స్వీకరించాలని చెప్పారు. గెలుపు కోసం కృషి, పట్టుదలతో పాటు శ్రమించాలన్నారు. అనంతరం గెలుపొందిన వారికి షీల్డ్ మెమెంటోలతోపాటు నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అంజన్నకు పూజలు

పుల్లంపేట : పెరియవరంలో వెలసిన అభయాంజనేయస్వామికి పూజారి శివశర్మ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచే స్వామి వారిని దర్శించుకోవడానికి భక్తులు క్యూ కట్టారు. అనంతరం భక్తులు స్వామి వారిని దర్శించుకొని కాయాకర్పూరం సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా



పెన్షనర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

రాయచోటి : ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి చొరవచూపుతానని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యేను నియోజకవర్గ పరిధిలోని పెన్షనర్ల సంఘం నాయకులు కలిశారు. వివిధ సమస్యలపై వారు చర్చించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని శ్రీకాంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఉద్యోగుల పెన్షనర్ల సంక్షేమానికి జగన్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఎమ్మెల్యే వివరించారు. పట్టణ అభివృద్ధి కోసం చేస్తున్న కృషి అభినందనీయమంటూ ఎమ్మెల్యేను వారు సత్కరించారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు చెంగల్ రెడ్డి, గౌరవ అధ్యక్షుడు రమణ, అసోసియేట్ అధ్యక్షుడు పి.చిన్నరెడ్డన్న, కార్యదర్శి ఈశ్వరయ్య, వారాది రెడ్డి, గురవయ్య, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

భగత్ వెబ్‌సిరీస్ ట్రైలర్ విడుదల

రాయచోటి : రాయచోటి ప్రాంత యువకులచే అద్భుతంగా చిత్రీకరించిన భగత్ వెబ్‌సిరీస్ అద్భుత విజయం సాధించాలని వైఎస్ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని వైఎస్ఆర్‌సీపీ కార్యక్రమంలో రాయచోటి ప్రాంత యువకులచే ప్రధాన తారాగణంగా చిత్రీకరించిన భగత్ వెబ్ సిరీస్ ట్రైలర్‌ను ఎమ్మెల్యే చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ వెబ్ సిరీస్‌ను రాయచోటి ప్రాంత యువకులు అగస్త్యేశ్వర ప్రొడక్షన్‌లో రాజకీయ ప్రతీకార డ్రామా ముఖ్య తారాగణంగా లిఖిత్, ఐతీశ్వర్, రాజేష్, మణికాంత్, మధు, హేమాద్రి, అల్లాబక్షూష్, ఉదయ్‌కుమార్, దీపక్ తదితరులు నటించగా డైరెక్టర్ ఐనుకుంటి మల్లికార్జున, సంగీతం సారథి ఆర్‌జీలు సారథ్యం వహించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, లక్కిరెడ్డిపల్లె ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి, రామాపురం జెడ్పీటీసీ మాసన వెంకటరమణ, డీసీసీబీ డైరెక్టర్ వెంకట్రామిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వడ్డి వెంకటరమణారెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటసుబ్బయ్యనాయుడు, పేయల శివశంకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఏసీల జీవితాల్లో వెలుగులు నింపండి



జెడ్పీ చైర్మన్ ఆకేపాటికి వినతిపత్రం అందిస్తున్న ఎన్‌ఏసీ ప్రతినిధులు

రాజంపేట రూరల్ : నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ యూనియన్ (ఎన్‌ఏసీ) సిబ్బంది జీవితాలలో వెలుగులు నింపాలని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డిని ఎన్‌ఏసీ ప్రతినిధులు కోరారు. మండల పరిధిలోని ఆకేపాటి ఎస్టేట్‌కు ఎన్‌ఏసీ రాష్ట్ర అధ్యక్షుడు జి.శంకరయ్య ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరు నుంచి విచ్చేసిన ఎన్ఈడబ్ల్యూ ప్రతినిధులు జెడ్పీ చైర్మన్ ఆకేపాటికి తాము ఎదుర్కొంటున్న సమస్యలను వినతి పత్రం రూపంలో అందజేశారు. గత 16 సంవత్సరాల నుంచి నిరుద్యోగ యువతకు నిర్మాణ రంగంలో మెరుగైన ఉపాధి లక్ష్యంగా నైపుణ్య ఉచిత శిక్షణ అందిస్తున్నామని తెలియజేశారు. తమకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ జీతాలను పెంపుదల చేసి హెచ్‌ఆర్ పాలసీని అమలు చేసే విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కె.శివశంకర్, ఉపాధ్యక్షుడు ఎస్‌కే రహంతుల్లా, జాయింట్ సెక్రటరీ డి.జితేంద్ర, జిల్లా కోశాధికారి ఎస్.సురేష్, గౌరవ సలహాదారు ఎల్.ప్రకాశ్, టి.చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ సెక్రటరీలపై పని భారం తగ్గించండి



మాట్లాడుతున్న లీలావతి

రాయచోటి అర్బన్ : గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న హెల్త్ సెక్రటరీలను మెడికల్, పంచాయతీ అధికారులు వేధించడం వెంటనే మానుకోవాలని ఏపీ గ్రామ, వార్డు సచివాలయం సెక్రటరీల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.లీలావతి డిమాండ్ చేశారు. పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం గ్రామ, వార్డు సచివాలయాల హెల్త్ సెక్రటరీల జిల్లా జనరల్ బాడీ సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామ, వార్డు సచివాలయాల కార్యదర్శులుగా పనిచేసే మహిళా ఉద్యోగులను కొందరు మెడికల్, పంచాయతీ అధికారులు వేధింపులకు గురిచేస్తున్నారంటూ ఆరోపించారు. ఎన్‌సీడీ సీడీ సర్వేలో వార్డు హెల్త్ సెక్రటరీలతోపాటు ఇతర ఉద్యోగులు పనిచేయాల్సి ఉన్నా టార్గెట్ సాధన పేరుతో హెల్త్ సెక్రటరీలను మాత్రమే ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ఆమె ఆరోపించారు. పని భారాన్ని తగ్గించాలని కోరారు. చట్టబద్ధంగా హెల్త్ సెక్రటరీలకు మంజూరు చేయాల్సిన సెలవులు ఇవ్వకుండా మెడికల్ ఆఫీసర్లు ఇబ్బంది పెట్టడం తగదన్నారు. జూన్ 27న డీఎం అండ్ హెచ్ఓ కార్యాలయం ఎదుట జరిగే నిరసన ప్రదర్శనలో హెల్త్ సెక్రటరీలంతా పాల్గొని విజయవంతం చేయాలంటూ కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పి.ఎల్.నరసింహులు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సాంబశివ, ఎస్.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి పుల్లయ్య, వెంకటేష్‌లతోపాటు హెల్త్‌సెక్రటరీల యూనియన్ నేతలు, హెల్త్‌సెక్రటరీలు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్



డాక్టర్ హర్షలత, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, రాయచోటి

రాయచోటి : డిగ్రీ కళాశాల ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.హర్షలత తెలిపారు. ఆదివారం ఈ మేరకు రాయచోటిలో పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో ప్రిన్సిపాల్ వెల్లడించారు. 2023–24 విద్యా సంవత్సరానికి డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ఈనెల 19వ తేదీ నుంచి 24వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈనెల 26వ తేదీ నుంచి 30వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లను ఎంచుకోవచ్చన్నారు. నూతన విద్యా విధానం అనుసరించి రాష్ట్ర ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం నుంచి అన్ని డిగ్రీ కళాశాలల్లో మేజర్, మైనర్ సబ్జెక్టుల విధానాన్ని ప్రవేశపెడుతున్నట్లు పేర్కొన్నారు. ఎంపీసీ గ్రూపులో కంప్యూటర్ సైన్స్ మేజర్ (ఫిజిక్స్ మైనర్), బీజెడ్సీ గ్రూపుల్‌లో జువాలజీ మేజర్, (కెమిస్ట్రీ మైనర్), బీకాం గ్రూపులో కంప్యూటర్ అప్లికేషన్స్ మేజర్ (ఎకనామిక్స్ మైనర్), బీఏ గ్రూపులో ఎకనామిక్స్ మేజర్ (హిస్టరీ మైనర్), బీఏ ఉర్దూ గ్రూపులో స్పెషల్ ఉర్దూ మేజర్ (రాజనీతి శాస్త్రం మైనర్) కోర్సులు ఉంటాయన్నారు. మైనర్ సబ్జెక్టుల ఎంపికను విద్యార్థుల ఆసక్తి మేరకు ఎంచుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల నూతన పోస్టర్‌ను రూపొందించి జిల్లాలోని పలు మోడల్ కళాశాలల్లో డిగ్రీ అధ్యాపకులు ప్రదానం చేశారన్నారు. కళాశాలలో నూతన విద్యార్థుల సౌకర్యార్థం హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ ప్రకటనలో తెలియజేశారు.

ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించండి



కాలేషాను అభినందిస్తున్న జయవర్ధన్

రాయచోటి అర్బన్ : నూతన విద్యాసంవత్సరం ప్రారంభాన్ని దృష్టిలో ఉంచుకుని ఇంటర్ విద్యార్థులకు వెంటనే పాఠ్యపుస్తకాలను అందచేయాలని ఆల్‌ఇండియా స్టూడెంట్ బ్లాక్ (ఏఐఎస్‌బీ) రాష్ట్ర కార్యదర్శి జయవర్ధన్ డిమాండ్ చేశారు. కళాశాలలు ప్రారంభమై రెండువారాలు గడుస్తున్నప్పటికి నేటికీ పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయకపోవడం దారుణమన్నారు. వెంటనే పాఠ్యపుస్తకాలను పంపిణీ చేయాలన్నారు. నూతన జాతీయ విద్యావిధానం అమలును ప్రభుత్వం వెంటనే ఆపాలన్నారు.

ఏఐఎస్‌బీ జిల్లా అధ్యక్షుడిగా కాలేషా

సమావేశంలో ఏఐఎస్‌బీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా కాలేషాను ఎంపికచేసినట్లు ఈ సందర్భంగా జయవర్ధన్ ప్రకటించారు. కాగా తనను జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక చేయడం పట్ల కాలేషా రాష్ట్ర కమిటీకి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్‌బీ రాయచోటి నేతలు షామీర్, యూనుస్, అంజాద్, ఆల్ ఇండియా ఫార్వర్డ్‌బ్లాక్ పార్టీ నేత అజంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించండి



నిరసన తెలుపుతున్న సీపీఐ శ్రేణులు

రాయచోటి అర్బన్ : రాష్ట్రంలో ట్రూఅప్, కస్టమర్, సర్‌చార్జీలు తదితర పేర్లతో ఇష్టారాజ్యంగా పెంచిన విద్యుత్ చార్జీలను ప్రభుత్వం వెంటనే తగ్గించాలని సీపీఐ అన్నమయ్య జిల్లా కార్యదర్శి పి.ఎల్.నరసింహులు డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఐ నేతలు, కార్యకర్తలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసిన అనంతరం విద్యుత్‌బిల్లులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇష్టారాజ్యంగా విద్యుత్ చార్జీలను పెంచి సామాన్య ప్రజల నడ్డి విరవడం తగదన్నారు. పెంచిన విద్యుత్‌చార్జీలను వెంటనే తగ్గించని పక్షంలో ప్రజల నుంచి తిరుగుబాటును ఎదుర్కోవలసి వస్తుందంటూ ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ రాయచోటి ఏరియా కార్యదర్శి ఎస్.శ్రీనివాసులు, జిల్లా కార్యవర్గసభ్యులు సాంబశివ, విశ్వనాథ నాయక్, సుమిత్రమ్మ, ఏపీ రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి రంగారెడ్డి, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి పుల్లయ్య, సీనియర్ నేత వెంకటేశు, గిరిజన సంఘం నేత శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.


నేరేడు.. ఔషధాలు మెండు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న నేరేడు పండ్లు

సంబేపల్లె : ప్రాచీన భారతానికి జంబూ ద్వీపమని పేరు.. జంబూ వృక్షమంటే సాధారణ భాషలో నేరేడు చెట్టు. ఈ వృక్ష ఫలాలలో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నట్లు పలు రకాల దీర్ఘకాలిక వ్యాధులకు దివ్య ఔషధంగా పని చేస్తున్నట్లు పరిశోధనలు తెలుపుతున్నాయి. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలలో నేరేడు సాగును రైతులు విస్తృతంగా చేపట్టి లాభాలను ఆర్జిస్తున్నారు. సీజన్ పంట అయిన నేరేడు మార్కెట్‌కు అధిక ధరలు పలుకుతుండటంతో రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. శరీరానికి కావాల్సిన కాల్షియం, ఇనుము, పొటాషియం, విటమిన్ – సి పుష్కలంగా లభించి వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించడంలో నేరేడు ప్రధాన పాత్ర పోషిస్తోంది. అలాంటి నేరేడు పండ్లకు డిమాండ్ తగ్గకపోగా కిలో రూ.200 నుంచి రూ.250 వరకు పలుకుతున్నాయి. దీనిని ఆసరాగా చేసుకొని కొందరు వ్యాపారస్తులు సిండికేట్ అయ్యి వారి వద్ద తక్కువ ధరకు కొని పట్టణంలో అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

రక్తదానం మహా పుణ్యకార్యం





శిబిరాన్ని పరిశీలిస్తున్న రీజనల్ మేనేజర్ శర్మ, రక్తదానం చేస్తున్న ఉద్యోగి శివప్రసాద్

రాజంపేట టౌన్ : రక్తదానం మహా పుణ్యకార్యం అని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ కేవీకేకేఎస్ శర్మ తెలిపారు. ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ హైదరాబాద్ సర్కిల్ తొలి ప్రధాన కార్యదర్శి దివంగత తారకనాథ్ 19వ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం స్థానిక ఎస్‌బీఐ ఏడీబీ శాఖలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరాన్ని రీజనల్ మేనేజర్ ప్రారంభించి మాట్లాడారు. తారకనాథ్ 32 సంవత్సరాల వయస్సులోనే ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ హైదరాబాద్ సర్కిల్ ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికై రికార్డు సృష్టించారని ఈ సందర్భంగా ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. తారకనాథ్ వర్ధంతిని పురస్కరించుకొని ప్రతి ఏడాది సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరు మూడు నెలలకోసారి రక్తదానం చేయాలని కోరారు. మనం చేసే రక్తదానం ఆపద సమయంలో ఓ నిండు ప్రాణాన్ని నిలుపుతుందన్నారు. రక్తదానం ఆవశ్యకతను విద్యావంతులు, యువత, ప్రజల్లో విస్తృతంగా చైతన్యం తీసుకురావాలని కోరారు. శిబిరంలో 150 మందికి పైగా యూనియన్ సభ్యులు రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు రక్తదాతల నుంచి రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ ఏడీబీశాఖ మేనేజర్ జ్ఞానప్రకాష్, యూనియన్ జనరల్ సెక్రెటరీ ఎంవీ.రాజు, రీజనల్ సెక్రెటరీ నాసిర్, 37 బ్రాంచ్‌లకు చెందిన యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం

గాలివీడు : క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తోందని గాలివీడు వైస్ ఎంపీపీ మిట్టపల్లి యదుభూషన్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మైదానంలో గత నెల రోజుల నుంచి జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగింపు వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన వెలిగల్లు ఎంవిఆర్ జట్టుకు రూ.36వేలు, రన్నరప్‌కు రూ.30వేలు నగదు బహుమతులతోపాటు జ్ఞాపికలను అందజేశారు. ఆయనతోపాటు వైఎస్సార్‌సీపీ నాయకులు వేణుగోపాల్, యువజన నాయకులు రమణారెడ్డి, మైనార్టీ యువ నాయకులు నిజాముద్దీన్, సుధాకర్‌రెడ్డి, నాగిరెడ్డి రామాంజులురెడ్డి, గంగాధర్, శివారెడ్డి, మోహన, విష్ణు, నాయుడు, లోకేష్ పాల్గొన్నారు.

'లయన్స్' ఆధ్వర్యంలో కంటి ఆపరేషన్‌లు

రాయచోటి అర్బన్ : రాయచోటి లయన్స్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం 34 మంది కంటి రోగులకు ఆపరేషన్‌లు నిర్వహించారు. కంటి ఆసుపత్రి ఆవరణలో నిర్వహించిన వైద్య శిబిరంలో అన్నమయ్య, సత్యసాయి, కడప జిల్లాల్లోని పలు ప్రాంతాలకు చెందిన సుమారు 70 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 34 మందికి కంటి ఆపరేషన్‌లు అవసరమని గుర్తించి ఆపరేషన్‌లు నిర్వహించారు. అలాగే గతవారం అపరేషన్‌లు చేయించుకున్న 35 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి కంటిఅద్దాలు, మందులను పంపిణీ చేశారు. రోగుల వెంట వచ్చిన సహాయకులకు లయన్స్ క్లబ్ సభ్యులు ఉచిత భోజన వసతిని కల్పించారు. క్లబ్ మాజీ అధ్యక్షుడు చెన్నూరు అన్వర్‌బాషా, కంటి వైద్యులు సురేష్‌బాబు, మహాలక్ష్మి, భార్గవి, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ రాజగోపాల్‌రెడ్డితోపాటు కంటి ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఊరించి.. భంగపరచిన మబ్బులు

పెనగలూరు : మండలంలో ఆదివారం వేకువజాము నుంచి మబ్బులు ఊరించాయి. చల్లని తుంపర కూడా పడటంతో వర్షం కురుస్తుందని రైతులు ఆశపడ్డారు. గత కొన్ని నెలలుగా ఎండ వేడిమితో ప్రజలు విసిగిపోయారు. వడగాలులతో తీవ్రంగా ఇబ్బంది పడిన ప్రజలకు ఆదివారం ఉదయం ఊరించిన మబ్బులు చూసి ఆనందపడ్డారు. అయితే గంటలోపే మబ్బులు కనపడకపోవడంతో రైతులు, ప్రజలు నిరాశ చెందుతున్నారు.

నల్ల గంగమ్మకు విశేషపూజలు

సంబేపల్లె : దేవరరాయి నల్లగంగమ్మ ఆలయంలో ఆదివారం అర్చకులు విశేషపూజలు నిర్వహించారు. ముందుగా ఆలయాన్ని వేపాకులతో ఆలయ ప్రాంగణమంతా శుద్ధి చేశారు. అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అర్చకులు, అభిషేకాలు నిర్వహించారు. వచ్చిన భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

మల్లూరమ్మ ఆలయంలో..

చిన్నమండెం : మల్లూరమ్మకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం కావడంతో అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. మొక్కుబడులు తీరిన వారు అమ్మవారికి బోనాలు సమర్పించారు.

ఘనంగా సత్యమ్మ తిరునాల

చిట్వేలి : సత్యమ్మ తిరునాలను నిర్వాహకులు అత్యంత ఘనంగా భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ మేరకు ఆలయాన్ని విద్యుత్ కాంతులతో శోభాయమానంగా అలంకరించారు. శనివారం రాత్రి మొదలైన తిరునాళ్లలో పోతుల రాజులు ఊరేగింపుతో సత్యమ్మను ఆలయంలోకి తీసుకువచ్చారు. ఆదివారం భక్తులు పొంగుబాలు పెట్టుకొని బలిలు సమర్పించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

కుర్నూతల గంగమ్మకు..

లక్కిరెడ్డిపల్లె : అనంతపురం గంగమ్మను ఆదివారం వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. సంబేపల్లి మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉదయ్ కుమార్ రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సిబ్బంది, పూజారులు ఆయనకు ఘన స్వాగతం పలికి దుశ్శాలువాతో సత్కరించారు.

ఓర్పు సహనానికి నిదర్శనం నాన్న



రాయచోటి టౌన్: మోహన్‌రెడ్డికి కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



రైల్వేకోడూరు: కొరముట్లకు శుభాకాంక్షలు తెలుపుతున్న కుమారులు

రాయచోటి టౌన్ : ఓర్పు, సహనానికి నిదర్శనం నాన్నని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఫాదర్స్ డే సందర్భంగా ఆయన తన తండ్రికి కేక్ తినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మన విజయాల కోసం అహర్నిశలు కృషి చేసేవాడే తండ్రి అన్నారు. తండ్రి అంటేనే ధైర్యం, బాధ్యత, త్యాగాలకు మారుపేరుగా నిలుస్తారని చెప్పారు. పిల్లల ఉన్నతి కోసం అహర్నిశలు శ్రమించేది నాన్నేనని చెప్పారు. నాన్న రుణం తీర్చుకోలేనిదన్నారు.

కొరముట్లకు శుభాకాంక్షలు తెలిపిన కుమారులు

రైల్వేకోడూరు : ఫాదర్స్ డే సందర్భంగా ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులుకు ఆయన కుమారులు పునీత్ రాయ్, రాజశేఖర్‌లు ఆదివారం మా నాన్నకు థ్యాంక్స్ హ్యాపీ ఫాదర్స్‌డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా నాన్నగారు సాధించిన విజయాలను మేము ఎప్పటికీ గర్వపడుతుంటామన్నారు. మాలాంటి వారికెందరికో నాన్న స్ఫూర్తి అని తెలిపారు. మా నాన్నలా ప్రోత్సహిస్తున్న అందరికీ ఫాదర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు.

ముగిసిన ఉచిత కంటి వైద్య శిబిరం



శిబిరానికి హాజరైన ప్రజలతో వైస్ ఎంపీపీ యదుభూషన్‌రెడ్డి

గాలివీడు : మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్(బాలుర)లో గాలివీడు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శ్రీ వేంకటేశ్వర అరవింద్ ఆసుపత్రి తిరుపతి సహకారంతో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో సుమారు 260 మందికి ఉచిత వైద్య పరీక్షలు చేశామన్నారు. అనంతరం వైస్ ఎంపీపీ యదుభూషన్‌రెడ్డి శిబిరాన్ని సందర్శించి వైద్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆపరేషన్‌కు 50 మందిని తిరుపతి శ్రీ వేంకటేశ్వర అరవింద్ ఆసుపత్రికి బయలుదేరిన వారితో మాట్లాడుతూ మీకు అన్ని సౌకర్యాలు ఉచితంగా అందిస్తామన్నారు. సోమవారం చికిత్స అనంతరం మంగళవారం మండలానికి క్షేమంగా అదే బస్సులో చేరుకుంటారన్నారు. సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయనతోపాటు రమేష్ రెడ్డి, చిన్నారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, వేణుగోపాల్, కంటి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

• చెట్లలో కలికి'తురాయి'



సంబేపల్లె : ప్రకృతి అనగానే.. ప్రధానంగా ప్రతి ఒక్కరికీ గుర్తుకు వచ్చేవి చెట్లు.. అందులోనూ పుష్పించే చెట్లు అంటే.. ప్రతి ఒక్కరికీ ఎంతో మక్కువ.. వృక్ష ప్రేమికులు వారి ఆవరణాలలో పలు రకాల కాల పరిస్థితులను బట్టి పుష్పించే చెట్లను పెంచుకోవడం పరిపాటి.. అలాగే ప్రభుత్వం కూడా ప్రకృతిని కాపాడుకుంటూ చెట్ల సంరక్షణకు పలు రకాల కార్యక్రమాలను చేస్తోంది. ఇందులో భాగంగా జాతీయ రహదారులు, గ్రామీణ రహదారుల వెంట ఇరువైపులా పుష్పించే అందమైన వృక్షజాతులను పెంచుతూ ప్రయాణీకులు, బాటసారులు, ప్రజలకు ఆహ్లాదభరితాన్ని పంచుతున్నారు. ప్రధానంగా కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిలోని సంబేపల్లె మండలం మోటకట్ల శివసాయి ఆలయ సమీపంలోనూ, యర్రగుంట్ల బస్టాప్ సమీపంలో ఎర్రటి పూలతో తురాయి చెట్లు పుష్పించి రహదారికి నూతన శోభను అందిస్తూ చూపరులను ఆకట్టుకుంటోంది.

అపూర్వం.. విద్యార్థుల సమ్మేళనం



గురువులను సన్మానించిన పూర్వవిద్యార్థులు

నందలూరు(రాజంపేట) : నందలూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆదివారం 1985 – 1986 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఎస్టీయూ నాయకుడు అల్లం అశోక్, రైల్వే కార్మిక నేత బద్వేలు మస్తాన్‌బాషా, రాజంపేట మార్కెట్ కమిటీ డైరక్టరు పల్లె మాధవిల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. గురువులైన కుళాయిరెడ్డి, కృష్ణయ్య, పుల్లారెడ్డి, ఆకుల వెంకటసుబ్బయ్య, జయరామరాజు, సాంబయ్య, రామసుబ్బన్నలకు పాదపూజ చేసి సత్కరించారు. పూర్వవిద్యార్థులు రూ.2.60లక్షల వ్యయంతో 73 డెస్కులను జెడ్పీ హైస్కూల్‌కు వితరణగా అందజేశారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు అరిగె హరిబాబు, భీమా శ్రీధర్, పెనుబాల నాగసుబ్బయ్య, జీవీఎం గోపాల్, బోనాసి నరసింహులు, కత్తి చలపతి, పీఎల్‌నారాయణ, గంటా అరుణ, మాలతి, శైలజ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. తమ దూరమైన మిత్రులకు శ్రద్ధాంజలి ఘటించారు.

అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు

సిద్దవటం : మండలంలోని జోకులపల్లె గ్రామ సమీపంలో వెలసిన అంకాలమ్మ అమ్మవారికి ఆదివారం స్థానికులు వైభవోపేతంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం, అలంకరణ, సహస్రనామార్చన, కుంకుమార్చన, అర్చనలు, తీర్థ ప్రసాదాల వినియోగం చేశారు. భాకరాపేట, శివునిపల్లె, మిట్టపల్లె, పెద్దపల్లె, పేరయ్యగారిపల్లె, బొగ్గిడివారిపల్లె పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి, అమ్మవారిని దర్శించుకొని కాయాకర్పూరాలను సమర్పించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులు అమ్మవారికి బోనాలను సమర్పించి, బలిని అర్పించి మొక్కుబడులను చెల్లించుకున్నారు. అంకాలమ్మ అమ్మవారి గుడికి వచ్చిన భక్తులకు వైఎస్ఆర్ సీపీ నాయకుడు తుర్రా ప్రతాప్ అన్నదాన కార్యాక్రమాన్ని పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు.